సాక్షి
శ్రీకాకుళం
సోమవారం ׀ 29 ׀ సెప్టెంబర్ ׀ 2025



తవ్వేస్తాం..దోచేస్తాం..

ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. నిబంధనలకు తూట్లుపొడుస్తూ యథేచ్ఛగా అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. - 8లో



వ్యయ ప్రయాసల రేషన్

గిరిజనులకు రేషన్ కష్టాలు వీడటం లేదు. రేషన్ కోసం ప్రతి నెలా రూ.200 వరకు ఖర్చు పెట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. - 8లో

నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక(గ్రీవెన్స్‌సెల్) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. గతంలో అర్జీల నమోదు, ప్రస్తుత పరిస్థితి తెలుసుకునేందుకు 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ఎవరొస్తారో..ఎప్పుడొస్తారో!

- రిమ్స్ సర్వజన ఆస్పత్రిలో కొరవడుతున్న పర్యవేక్షణ
- సక్రమంగా అమలు కాని ఫేస్ అటెండెన్స్

శ్రీకాకుళం : శ్రీకాకుళం రిమ్స్ సర్వజన ఆస్పత్రిలో పర్యవేక్షణ కొరవడుతోంది. ఫేస్ రికగ్నిజేషన్ అటెండెన్స్ సక్రమంగా అమలు కావడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటర్ల సెలవులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఫేస్ రికగ్నిజేషన్ అటెండెన్స్ రెండేళ్లుగా అమలు చేస్తోంది. ప్రత్యేక యాప్ ద్వారా హాజరు వేయకుంటే ఆ రోజును సెలవుగా పరిగణిస్తారు. ఈ హాజరును పరిశీలించి జీతాన్ని మంజూరు చేయాల్సి ఉంటుంది. రిమ్స్ ఆసుపత్రిలో మాత్రం ఇది అస్సలు అమలు కావడం లేదు. దీనిని ఎవరు పరిశీలిస్తున్నారన్నది కూడా అంతుచిక్కడం లేదు. రాష్ట్రస్థాయిలో సైతం ఈ హాజరును పరిశీలిస్తున్నట్లు కనిపించడం లేదు. ఓ అధికారి తరచూ అనధికారికంగా గైర్హాజరవుతున్నా ఫేస్ అటెండెన్స్ వేయకుండా నెల మొత్తానికి జీతాలు చెల్లించేస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో సైతం దీనిపై దృష్టి సారించకపోవడం గమనార్హం. రిమ్స్ లోని చాలామంది వైద్యులు విశాఖపట్నం నుంచి రాకపోకలు సాగిస్తుండడంతో నిర్ణీత సమయానికంటే చాలా ముందుగానే వెళ్లిపోతున్నారు. దీనిని పర్యవేక్షించాల్సిన అధికారి సైతం నిర్ణీత సమయం కంటే ముందుగా వెళ్లిపోవడం, సెలవులో ఉండటం జరుగుతుండడం వల్ల ప్రశ్నించే వారే లేకుండాపోతున్నారు. ఈ కారణంగానే గైర్హాజరవుతున్న అధికారిని సైతం అడగలేని పరిస్థితి నెలకొంది.

నవంబరు 11 నుంచి సిక్కోలు పుస్తక మహోత్సవం



గుర్రం జాషువా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో నవంబరు 11 నుంచి 20 వరకు సిక్కోలు పుస్తక మహోత్సవం–2025, సాహిత్య, సాంస్కృతిక వైజ్ఞానిక సంబరాలు నిర్వహించాలని సన్నాహక కమిటీ ప్రతినిధులు నిర్ణయించారు. ఈ మేరకు శ్రీకాకుళం యూటీఎఫ్ భవనంలో సిక్కోలు పుస్తక మహోత్సవ కమిటీ ఆదివారం సమావేశమైంది. ముందుగా జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ 100 ప్రచురణ సంస్థలు బుక్ స్టాల్స్ ఏర్పాటు చేయనున్నాయని చెప్పారు. 10 రోజుల పాటు సాహిత్య సభలు, పుస్తక పరిచయాలు, కవి సమ్మేళనాలు జరుగుతాయని తెలిపారు. సాంస్కృతిక వేదికపై జిల్లా సంస్కృతిని ప్రతిబింబించే తప్పెటగుళ్లు, జముకుల పాట, కోలాటం, పగటి వేషాలు, నాటిక, డ్యాన్సులు, సంగీత ప్రదర్శనలు, ఏకపాత్రాభినయ ప్రదర్శనలు, సైన్స్‌ఫెయిర్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, కవితలు, కథలు వంటి అంశాలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. ఫుడ్ స్టాల్స్ కూడా అందుబాటులో ఉంటాయని చెప్పారు. సమావేశంలో సిక్కోలు పుస్తక మహోత్సవ కన్వీనర్ కేతవరపు శ్రీనివాస్, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజయ్ శర్మ, అట్టాడ అప్పలనాయుడు, ఎల్.రామలింగస్వామి, యు.నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి, కంచరాన భుజంగరావు, చింతాడ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో భక్తజనం



విజయనగరం ఎస్పీ దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న శ్రీకాకుళం ఎస్పీ

అరసవల్లి/గార: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. దసరా సెలవులు సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చారు. విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ కుటుంబ సమేతంగా ఆదిత్యుని దర్శించుకున్నారు. ఈయన వెంట జిల్లా ఎస్పీ కె.మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.2,78, 800, విరాళాల రూపంలో రూ.66,718, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.05లక్షలు వరకు ఆదాయం లభించినట్లు ఈవో కె.ఎస్.వి.డి.వి.ప్రసాద్ తెలిపారు. ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథున్ని కూడా విజయనగరం ఎస్పీ దామోదర్ దర్శించుకున్నారు. ఈవో కె.నరసింహానాయుడు స్వామి చిత్రపటాన్ని, క్షేత్ర ప్రసాదాన్ని అందించారు. .



సారవకోట: అవలింగిలో కరెన్సీ నోట్లతో నీలమణిదుర్గకు అలంకరణ



ఇచ్ఛాపురం: కాళరాత్రి అమ్మవారిగా స్వేచ్ఛావతి అమ్మవారు



సారవకోట: శాకంబరీదేవిగా ఉజ్జయిని మహాకాళీ అమ్మవారు



పాతపట్నం: మహాచండీదేవిగా నీలమణిదుర్గ



శ్రీకాకుళం కల్చరల్: బలగ కాలభైరవ పీఠంలో సహస్ర కలువలతో పూజలు

శక్తి స్వరూపిణీ నమోస్తుతే

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. అమ్మవారు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆదివారం పలుచోట్ల అమ్మవారిని కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. మరికొన్నిచోట్ల ప్రత్యేక హోమాలు నిర్వహించారు.

- సాక్షి నెట్‌వర్క్

ఎక్సైజ్‌కు డబుల్ కిక్

నెలవారీ వసూళ్లు.. తోడుగా దసరా మామూళ్లు!



- బెల్ట్‌షాపుల నుంచి వైన్‌షాపుల వరకు సొమ్ము ఇచ్చుకోవాల్సిందే
- రూ.5వేల నుంచి రూ.25 వేల వరకు రేట్ ఫిక్స్
- నెలవారీ మామూళ్లకు ఇవి అదనం
- మద్యం ధరలు పెంచుకునేందుకు వెసులుబాటు!

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

మద్యం షాపుల నుంచి ఎక్సైజ్ తదితర వర్గాలు నెలవారీ వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా దసరా మామూళ్లు సైతం ఫిక్స్ చేశారని తెలిసింది. బెల్ట్ షాపునకు రూ.5వేలు, దాబాకు రూ.10వేలు, వైన్ షాపునకు రూ.25వేలు చొప్పున నిర్వాహకుల నుంచి వసూలు చేస్తున్నట్లు సమాచారం. బెల్ట్‌షాపులు, దాబాల నుంచి వసూలు చేసే బాధ్యతను కొంతమంది సిబ్బందికి అప్పగించగా, వైన్‌షాపుల బాధ్యత ఓ క్షేత్రస్థాయి అధికారికి అప్పగించినట్టు వ్యాపార వర్గాల ద్వారా తెలుస్తోంది. వసూలు చేసిన దాంట్లో వాటాలు కూడా నిర్ణయించినట్టు సమాచారం.

బెల్టుషాపుల హవా..

జిల్లాలో సిండికేట్ హవా నడుస్తోంది. బెల్ట్‌షాపుల దందా కొనసాగుతోంది. ఎంఆర్‌పీకి మించి విక్రయాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎక్సైజ్ వర్గాలకు ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.జిల్లాలో వైన్‌షాపులు, పర్మిట్ రూమ్‌లు ఇప్పటికే ఉండగా, అనుబంధంగా బెల్ట్‌షాపులు ఉన్నాయి. ఒక్కొక్క గ్రామంలో కాదు.. ఒక్కొక్క వీధిలో నాలుగైదు బెల్ట్‌షాపులు నడుస్తున్నాయి.

కోడ్ ప్రకారమే..


కొన్నిచోట్ల ఏకంగా డిస్ట్రిబ్యూషన్ పాయింట్ ఉంచి ఏ దుకాణానికి, ఏ కోడ్‌తో ఏ మద్యం సరఫరా చేయాలనే దానిపై నిర్ణయం తీసుకుని బెల్ట్‌షాపులకు సరఫరా చేస్తున్నారు. మద్యం విక్రయించే సమయంలో కూడా ఎంచుకున్న కోడ్‌తో ఏ, బీ, సీ, డీ అనే అక్షరాలు బాటిల్‌పై రాస్తున్నట్టు తెలుస్తోంది. వాటి ఆధారంగా బెల్ట్‌షాపులకు విక్రయిస్తున్నారు. ఎవరైనా అధికారులు దాడులు చేసి మద్యం సీసాలను పట్టుకుంటే ఆ కోడ్‌ను చూసి వదిలేసేలా ఏర్పాట్లు చేసుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. మొత్తానికి బెల్ట్ వ్యవహారం పక్కా పథకం ప్రకారం జరుగుతోంది. వైన్ షాపుల నుంచి బెల్ట్‌షాపులకు ఒక్కొక్క క్వార్టర్ బాటిల్‌పై రూ.10 నుంచి రూ.30 వరకు అదనంగా వేసి ఇస్తున్నట్టు తెలుస్తోంది. వాటిపై మరో రూ.20, రూ.30, రూ.40, రూ.50 వేసి మందుబాబులకు విక్రయిస్తున్నారు. ఇదంతా జరగాలంటే ఎక్సైజ్ వర్గాల ప్రోత్సాహం ఉండాల్సిందే.

కొనసాగుతున్న ముడుపుల పర్వం..

సిండికేట్‌తో ఒప్పందాలు, నెలవారీ ముడుపుల పర్వం కొనసాగుతోంది. బెల్ట్‌షాపులు పెరిగిన తర్వాత వ్యాపారం కూడా పెరగడంతో మొదట్లో ముడుపులు ఇవ్వడానికి వ్యాపారులు కొంత ఇబ్బందిపడ్డా..ఇప్పుడు లాభాలు వస్తుండటంతో ముడుపుల విషయాన్ని పెద్ద భారంగా తీసుకోవడం లేదు. ఇదంతా నెలవారీ బాగోతం. ఇప్పుడు దసరా వచ్చింది. గ్యాస్, పాలు, పారిశుద్ధ్య కార్మికుడు, మెకానిక్‌ల దగ్గరి నుంచి ప్రతీ ఒక్కరికీ ఇష్టంగానో, కష్టంగానో ఎంతో కొంత ఇవ్వడం ఆనవాయితీ. ఇక్కడ కూడా అదే తరహాలో ఇవ్వాలని.. పండగ చేసుకోవాలని వైన్‌షాపు, బెల్ట్‌షాపు, దాబాలకు ధరలు నిర్ణయించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో వ్యాపారులకు ఆఫర్ కూడా ఇచ్చినట్టు సమాచారం. దసరా పండగ సీజన్‌లో ఎంఆర్‌పీకి మించి ధరలు పెంచుకునే వెసులుబాటు కల్పించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బెల్ట్‌షాపుల్లోనైతే ఒక్కొక్క బాటిల్ పై రూ.50కిపైగా పెంచాలని ఇప్పటికే బెల్ట్ నిర్వాహకులు నిర్ణయానికొచ్చారు. జిల్లా అంతటా ఇదే తంతు నడుస్తోంది.

నిష్క్రమణ.. నిరసన..

- వాట్సాప్ గ్రూపుల నుంచి సచివాలయ ఉద్యోగుల ఎగ్జిట్
- ఉద్యమాన్ని ఉధృతం చేసిన సచివాలయం ఉద్యోగులు
- ప్రభుత్వ ఉదాసీన వైఖరిపై మండిపాటు
- నిలిచిపోనున్న కమ్యూనికేషన్
- కుంటుపడనున్న సచివాలయాల పాలన



వాట్సాప్ గ్రూప్ నుంచి ఎగ్జిట్ అయిన ఉద్యోగులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: గ్రామ సచివాలయం ఉద్యోగులు పోరుబాటు మరింత ఉధృతం చేశారు. అన్ని పనులు చేస్తున్నా ప్రభుత్వం తమను గుర్తించడం లేదని, తమకొచ్చే ప్రయోజనాలు ఏంటో చెప్పడం లేదని, ఏ శాఖ నుంచి నుంచి తమకు గౌరవం ఉంటుందో స్పష్టత ఇవ్వలేదని, రెండు నోషల్ ఇంక్రిమెంట్లు ఇవ్వలేదని, తొమ్మిది నెలల ఎరియర్స్ మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సమస్యల పరిష్కారం కోసం శనివారం సాయంత్రం ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ నిర్వహించారు. ఆదివారం మరో అడుగు ముందుకేసి ఏకంగా అధికారిక వాట్సాప్ గ్రూపుల నుంచి సచివాలయం ఉద్యోగులంతా ఎగ్జిట్(లెఫ్ట్) అయ్యారు.

పోరుబాటులో 7800 మంది ఉద్యోగులు



జిల్లాలో 7800 మంది సచివాలయం ఉద్యోగులు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నంతకాలం సంతోషంగా ఉద్యోగం చేసేశారు. ఎవరి విధులు వారు నిర్వహించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కష్టాలు మొదలయ్యాయి. వలంటీర్లు చేయాల్సిన పనులే కాకుండా వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది చేయాల్సిన పనులను కూడా సచివాలయం ఉద్యోగులతో చేయిస్తున్నారు. అవి కూడా నిర్దేశిత పనివేళల్లో కూడా తెల్లవారుజాము నుంచే చేయమంటున్నారు. రకరకాల సర్వేల పేరుతో మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఓటర్ల సర్వే, పీ 4సర్వే, ఎల్‌ఆర్ఎస్.. ఇలా రకరకాల సర్వేలు చేయించడంతో పాటు అనేక రకమైన పనులు అప్పగిస్తున్నారు. ఒక్కో విభాగానికి చెందిన ఒక్కో ఉద్యోగికి అనేక రకాల పనులు అప్పగిస్తుండటంతో సచివాలయం ఉద్యోగులు తట్టుకోలేకపోతున్నారు. దానికితోడు రాజకీయ ఒత్తిళ్లు, వేధింపులు మరింత ఎక్కువయ్యాయి. అంతా వారి కనుసన్నల్లో పనిచేయాలని హుకుం జారీ చేయడం, వినకపోతే సతాయిస్తున్నారు. దీంతో ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురై అనారోగ్యం బారిన పడుతున్నారు. కొందరు మృత్యువాత పడుతున్నారు. ఇవన్నీ భరించలేక గ్రామ సచివాలయం ఉద్యోగులు రోడ్డెక్కారు.

పండగ పూట జీతాలు నిలిపివేత

సచివాలయం ఉద్యోగుల్లో ప్లానింగ్ విభాగానికి చెందిన ఉద్యోగులకు జీతాలు సమస్య ఎదురైంది. ఎల్ఆర్ఎస్(ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్) సమస్యల పరిష్కారం వేగవంతం చేయడం లేదని సచివాలయం ప్లానింగ్ ఉద్యోగులు జీతాల బిల్లు పెట్టలేదు. దీంతో దసరాకు ప్లానింగ్ ఉద్యోగులు జీతాలు రాని పరిస్థితి నెలకొంది. అన్ని మున్సిపాలిటీల్లో ఇదే పరిస్థితి చోటు చేసుకుంది. వీరంతా పండగ పూట తమకీ కష్టాలేంటని ఆగ్రహం చెందుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారిక వాట్సాప్ గ్రూపుల నుంచి ఎగ్జిట్ అయ్యారు. ఒక్కొక్క ఉద్యోగికి ఐదారు అధికారిక వాట్సాప్ గ్రూపులుంటాయి. దీంతో ఉద్యోగులకు ఉత్తర ప్రత్యుత్తరాలు అందవు. కమ్యూనికేషన్ గ్యాప్ ఏర్పడటంతో సచివాలయం వ్యవస్థ పాలన కుంటుపడనుంది.

కళా ప్రదర్శనలకు ఆహ్వానం



శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ (నల్సా) ఆధ్వర్యంలో 'అందరికీ న్యాయం – న్యాయ సహాయం' అనే అంశంపై ఫొటోగ్రఫీ – కళల ప్రదర్శనకు ఎంట్రీలను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫొటో, పెయింటింగ్, స్కెచ్ విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

కాంప్లెక్స్ కిటకిట



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

- సరిపడా బస్సులు లేక ప్రయాణికుల పాట్లు
- గంటల తరబడి తప్పని నిరీక్షణ

శ్రీకాకుళం అర్బన్: దసరా సెలవుల నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిన ప్రయాణికులతో రాకపోకలు సాగిస్తున్నాయి. సెలవులకు తోడు మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తుండటంతో ప్రతి బస్సు రద్దీగా కనిపిస్తోంది. సీట్లు సంగతి పక్కనపెడితే నిల్చునేందుకు కూడా జాగా లేని పరిస్థితి నెలకొంటోంది. తాజాగా ఇంటర్మీడియెట్, ఇతర ఉన్నత విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో దూరప్రాంతాల నుంచి విద్యార్థులు ఆదివారం జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం చేరుకోవడంతో కాంప్లెక్స్ కిటకిటలాడింది. ఎక్కువగా విశాఖ నుంచి నాన్‌స్టాప్ బస్సులతో పాటు సిటీ బస్సులు సైతం నాన్‌స్టాప్ బస్సులుగా నడిపారు. మరోవైపు, సకాలంలో బస్సులు రాక ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించారు.



కాంప్లెక్స్ ఆవరణలో ప్రయాణికుల రద్దీ

బయటపడుతున్న.. బంగారం బండారం!

- బట్టబయలవుతున్న బంగారం మోసాలు
- నరసన్నపేటకే పరిమితమా?
- జిల్లా వ్యాప్తంగా ఇదే బాగోతమా?
- మొన్న నకిలీ హాల్‌మార్క్ మోసం
- తాజాగా జీఎస్టీ అధికారుల సోదాలతో వెలుగులోకి జీరో వ్యాపారం
- చివరికీ మోసపోతున్నది వినియోగదారులే



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

బంగారం వ్యాపారానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే నరసన్నపేటలో ఇటీవల కాలంలో పలు అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. ఇది ఒక్క పేటకే పరిమితం కాకుండా.. జిల్లా అంతటా పలు షాపుల్లో అక్రమాలు కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నరసన్నపేటలో ఆ మధ్య నకిలీ హాల్‌మార్క్ బంగారం పెద్ద ఎత్తున దొరికింది. ఇప్పుడేమో జీఎస్టీ అధికారుల దాడులతో జీరో వ్యాపారం జరుగుతున్నట్టు స్పష్టమవుతోంది. ప్రభుత్వానికి ట్యాక్స్ ఎగ్గొట్టి వినియోగదారులను కొల్లగొడుతున్నట్లు తెలుస్తోంది. తీగ లాగితే డొంకంతా కదిలినట్టు ఇప్పుడిది నరసన్నపేటకే పరిమితం కాకుండా జిల్లా అంతటా నడుస్తున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మాటల గారడీ..

ధర పెరిగినా ప్రజలకు బంగారంపై మోజు తగ్గడం లేదు. తులం బంగారం రూ.లక్షా 25 వేలు దాటినా వెనక్కి తగ్గడం లేదు. రోజురోజుకూ అమ్మకాలు పెరుగుతూనే ఉన్నాయి. బంగారానికి ఉన్న డిమాండ్‌ను కొందరు వ్యాపారులు క్యాష్ చేసుకుంటున్నారు. ప్రజల్ని అమాయకులను చేసి బురిడీ కొట్టిస్తున్నారు. నాలుగు మంచి మాటలు చెప్పి బుట్టలోకి లాగేస్తున్నారు. ఈ క్రమంలో జరుగుతున్న మోసాల్లో బయటికొచ్చినవి కొన్నే. వెలుగులోకి రానివెన్నో. అలాగని అందరూ అలాంటి వారు కాదు. కొందరు నిజాయితీగా వ్యాపారం చేసి, వినియోగదారుల మన్ననలు, నమ్మకం పొందుతున్నారు.

దొంగ బంగారం ఆరోపణలు..

ఇప్పటికే దొంగతనం బంగారం, నాణ్యత తక్కువ ఉన్న ఆభరణాలు, ట్యాక్స్ చెల్లించని బంగారం విక్రయిస్తుంటారన్న ప్రచారం ఉంది. గతంలో దొంగ బంగారాన్ని పోలీసులు రికవరీ చేసిన సందర్భాలు ఉన్నాయి. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి వచ్చి కూడా ఇక్కడ రికవరీ చేశారు. 24 క్యారెట్ అని 22 క్యారెట్, 22 క్యారెట్ పేరిట 18 క్యారెట్ బంగారం ఇస్తున్నారన్న వాదనలు ఉన్నాయి. బిల్లులపై స్పష్టంగా రాయడం లేదని ఆ మధ్య ఒక అధికారి హెచ్చరించినట్టు తెలిసింది. మొత్తానికి మోసమనేది కొన్నిచోట్ల జరుగుతోంది.

జీరో వ్యాపారం..

మోసాలతో పాటు జీరో వ్యాపారం జోరుగా సాగుతున్నట్టుగా తాజాగా జరిగిన జీఎస్టీ అధికారుల సోదాలతో తెలుస్తోంది. కోయంబత్తూరు, చెన్నై, ముంబై తదితర నగరాల నుంచి బిల్లులు లేకుండా కొనుగోలు చేసిన బంగారాన్ని ఇక్కడ వినియోగదారులకు కట్టబెడుతున్నట్టు సమాచారం. ఒక్క వినియోగదారులకే కాకుండా పలు షాపులకు కూడా సరఫరా చేస్తున్నట్టు తెలుస్తోంది. స్థానికంగా మాత్రం ఆ జీఎస్టీ లెక్కలు ఎవరికీ అర్థం కాకుండా వేస్తున్నారు. కొందరికైతే జీఎస్టీ లేకుండా బంగారం విక్రయిస్తున్నారు. జీఎస్టీ లేకుండా బంగారం కావాలంటే బిల్లులు ఉండవని చెప్పేస్తున్నారు. ఈ తరహా కొనుగోళ్లలోనే మోసాలు జరుగుతున్నాయి. బిల్లుల్లేని బంగారంలో మోసాలకు పాల్పడుతున్నారు. తిరిగి అమ్మేటప్పుడు నిలదీయాలంటే బిల్లులు ఉండాలి. అవి లేనప్పుడు వినియోగదారుడు ఏం అడగగలడని కొందరు వ్యాపారులు దగా చేస్తున్నారు. బయటపడుతున్న ఘటనలన్నీ నరసన్నపేటలో అయినప్పటికీ దాని లింకు జిల్లా వ్యాప్తంగా ఉందనే వాదనలు ఉన్నాయి. మొత్తానికి బంగారం విషయంలో జిల్లాకు చెడ్డ పేరు వస్తోంది. బంగారంలో నాణ్యత, లావాదేవీలు ఎంతవరకు కచ్చితమనేది చెప్పలేని పరిస్థితి నెలకొంది.

నకిలీ హాల్‌మార్క్ మోసాలు..

ప్రత్యేకంగా తయారు చేసిన లేజర్ మిషనరీతో నకిలీ హాల్‌మార్క్ వేసి బంగారం విక్రయిస్తున్నారు. ఆ నకిలీ హాల్‌మార్క్ బయటపడకుండా ఉండేందుకు నెట్‌లో ఉన్న వేరే వారి హెచ్‌యూఐడీ నంబర్లు వేస్తున్నారు. సాధారణంగా హెచ్‌ఐయూడీ నెంబర్‌ను గూగుల్ సెర్చ్ చేస్తే మొత్తం వివరాలన్నీ వచ్చేస్తాయి. ఆ రకంగా వెలుగు చూడకూడదని వేరే వారి హెచ్‌ఐయూడీ నంబర్‌ను ఉపయోగించి సొంతంగా ఏర్పాటు చేసుకున్న మిషన్‌తో హాల్‌మార్క్ వేసి వ్యాపారం సాగించేస్తున్నారు. ఆ మధ్య నరసన్నపేటలో ఇదే మోసం వెలుగుచూసింది. వాస్తవంగా ఈ రకమైన మోసం జిల్లాలో చాలాచోట్ల జరుగుతోందని సమాచారం. ఆకస్మిక తనిఖీల్లో అక్కడ బండారం బయటపడింది. దీంతో మనం కొనుగోలు చేస్తున్న బంగారంలో నాణ్యతెంతో ? అన్న అనుమానం వినియోగదారుల్లో నెలకొంది.

క్లుప్తంగా

బ్యాంగిల్ షాపు దగ్ధం


కాలిపోయిన సామగ్రి

టెక్కలి రూరల్: టెక్కలి ఎన్టీఆర్ కాలనీ 10వ లైన్‌లో కోటిపల్లి కృష్ణారావు, దమయంతికి చెందిన బ్యాంగిల్ షాపు దగ్ధమైంది. శనివారం రాత్రి 12 గంటల సమయంలో షాపు నుంచి పొగ రావడంతో చుట్టుపక్కలవారు గమనించి షాపు యజమానికి ఫోన్‌లో సమాచారం అందించారు. యజమాని హుటాహుటిన షాపు వద్దకు చేరుకోగా అప్పటికే మంటలు ఎగసిపడ్డాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే షాపులో చీరలు, ఫ్యాన్సీ సామగ్రి, గాజులు ఇతర వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.2లక్షల నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నరసన్నపేట: జమ్ము కూడలి వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన పోలాకి మండలం గాతలవలసకు చెందిన బమ్మిడి దామోదర రావు ఆదివారం ఉదయం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో (54) మృతి చెందాడు. స్థానిక హోటల్లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న దామోదరరావు డ్యూటీ ముగించుకొని జమ్ము కూడలి వద్ద రోడ్డు దాటుతుండగా శ్రీకాకుళం నుంచి టెక్కలి వైపు వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 అంబులెన్సులో నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గా ప్రసాద్ తెలిపారు. దామోదరరావు భార్య వీరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గంజాయితో పట్టుబడిన రౌడీషీటర్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని డచ్‌బంగ్లా వద్ద రెండు కిలోల గంజాయితో నగరానికి చెందిన ఓ రౌడీషీటర్ పట్టుబడ్డాడు. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక మంగువారితోట కండ్రవీధికి చెందిన బొమ్మలాట హరికృష్ణ ఒడిశాకు చెందిన గుర్తు తెలియని వ్యక్తి వద్ద నుంచి గంజాయిని తెచ్చి డచ్‌బంగ్లా సమీపంలో విక్రయం చేసేందుకు వేచి ఉండగా ఎస్ఐ ఎం.హరికృష్ణ సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. గతంలో ఓ మహిళపై అఘాయిత్యానికి సంబంధించి కేసులో హరికృష్ణపై షీట్ ఓపెన్ అవ్వడం, కొట్లాట కేసు కూడా ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితుడిని అరెస్టు చేసినట్లు, కేసును సీఐ పైడపునాయుడు దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటో పట్టణ పోలీసులు పేర్కొన్నారు.

జనసేనలో వర్గ విభేదాలు

కంచిలి: జనసేన పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ నాయకత్వంపై జిల్లా పార్టీ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్‌కు స్థానిక పార్టీ నేతలు ఆదివారం ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలో కష్టపడే నాయకులకు, జన సైనికులకు, వీర మహిళలకు గుర్తింపు ఉండటం లేదని, ఇదేంటని ప్రశ్నిస్తే తాము వేరే పార్టీ వాళ్లమంటూ వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ దుర్భాషలాడుతూ గొడవలు సృష్టిస్తున్నారని వాపోయారు.


వసప గ్రామంలోని ఇసుక స్టాక్ పాయింట్ వద్ద లారీలకు ఇసుక లోడ్ చేస్తున్న దృశ్యం

తవ్వేస్తాం.. దోచేస్తాం

- జిల్లాలో రెచ్చిపోతున్న ఇసుకాసురులు
- యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు, రవాణా
- చోద్యం చూస్తున్న అధికారులు

కొత్తూరు:

మండలంలోని వసప గ్రామ సమీపంలో బలద గ్రామం పేరుతో ఇసుక ర్యాంపును ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే ఇసుక ర్యాంపులో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నదికి వరదలు వచ్చినట్లయితే ఇసుక తవ్వకాలకు ఆటంకం లేకుండా ఉండేందుకు నది మధ్యలో భారీగట్టును నిర్మించారు. దీంతో నదికి వచ్చిన వరద ప్రవాహం మారిపోయే ప్రమాదం ఉంది. నిబంధనల మేరకు నదిలో ఇసుకను కూలీలతో తవ్వకాలు జరిపి ట్రాక్టర్‌కు లోడు చేయించాలి. అయితే అందుకు విరుద్ధంగా ఇక్కడ ప్రొక్లెయినర్లతో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. ప్రొక్లెయినర్లతో రెండు నుంచి మూడు మీటర్ల లోతులో తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ విధంగా తవ్వకాలు చేయడం వలన భూగర్భ జాలలు తగ్గిపోయే ప్రమాదం ఉంది.


నది మధ్యలో అడ్డంగా నిర్మించిన గట్టు

పేరుకే ఉచితం

ప్రభుత్వం ఉచితంగా ఇసుక అని చెబుతున్నా ఇక్కడ అమలు జరగడం లేదని తెలుస్తోంది. ఉచిత ఇసుక పేరుతో సుమారు 20 టన్నుల ఇసుకను రూ. 15 వేల వరకు అమ్ముకుంటున్నట్లు సమాచారం. అక్రమంగా ఇక్కడ నుంచి విజయనగరం, విశాఖపట్నంతో పాటు పలు పట్టణాలకు ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణాలపై మైన్స్ అధికారులు పట్టించుకోవడం లేదు. అధిక లోడుతో ఇసుక లారీలు వెళ్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అంతేకాకుండా నదిలో ఇంతవరకు ఎన్ని క్యూబిక్ మీటర్ల ఇసుక తరలించారన్న లెక్కలు కూడా తెలియడం లేదు. మరోవైపు రోడ్ల మీద అధికంగా ఇసుక లారీలు వెళ్తుండడంతో రోడ్లు గోతులమయంగా మారి ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

గట్టు నిర్మాణంతో ప్రమాదం



వర్షాకాలంలో ఇసుక తవ్వకాలకు ఇబ్బందులు లేకుండా నదిలో అడ్డంగా నిర్మించిన గట్టు నదికి పైభాగాన ఉన్నందున్న వరదలు వచ్చినట్లయితే కుంటిభద్ర, సిరుసువాడ, వసప కాలనీ గ్రామాలకు ప్రమాదకరంగా మారుతుంది. నదిలో వరద ఉధృతంగా వచ్చినప్పుడు గట్టు అడ్డంగా ఉన్నందున గ్రామాల్లో వరద నీరు వచ్చే ప్రమాదం ఉంది. అక్రమంగా జరుగుతున్న ఇసుక తవ్వకాలను అధికారులు నిలుపుదల చేయాలి.

– అగతమూడి నాగేశ్వరరావు, కుంటిభద్ర, కొత్తూరు మండలం

స్నేక్‌హితుడు..!

- పాములు పట్టడంలో నేర్పరి వేణుగోపాలరావు
- 10 వేలకుపైగా పాములు పట్టిన నైపుణ్యం

హిరమండలం:

ఆయన ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించాడు. ఓ వైపు సాగు చేస్తూనే.. మరోవైపు ఎలక్ట్రీషియన్, మెకానిక్‌గా కూడా రాణిస్తున్నాడు. అన్నింటికీ మించి అలవోకగా పాముల ను పట్టే నేర్పరి. అలాగని ఎక్కడా శిక్షణ తీసుకోలేదు. ఎవరి వద్ద శిష్యరికం చేయలేదు. కానీ బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు సాధించాడు హిరమండలం మండలం ఎం.అవలంగికి చెందిన లోలుగు వేణుగోపాలరావు. ఇప్పటివరకు 10 వేలకుపైగా పాములను పట్టి సురక్షిత ప్రాంతాల్లో విడిచిపెట్టిన ఘనత ఆయనది. ఆయనను 'సాక్షి' పలకరించగా ఆసక్తికర విషయా లను వెల్లడించారు.

20 ఏళ్ల వయస్సులోనే ఆసక్తి

వేణుగోపాలరావుకు ప్రస్తుతం 55 ఏళ్ల వయస్సు. 20 ఏళ్లలోనే పాములు పట్టాలన్న ఆసక్తి పెరిగింది. చిన్నప్పుడు వ్యవసాయ పనుల్లో భాగంగా ఎంతోమంది పాముకాటుకు గురై అవస్థలు పడిన ఘటనలు చూసిన వేణుగోపాలరావుకు మనస్సు కలచివేసిందట. అదే సమయంలో పాములను చంపేస్తున్న ఘటనలు చూసి బాధపడేవాడు. దీంతో అప్పుడే పాములు పట్టాలన్న ప్రయత్నం మొదలుపెట్టారు. ఎక్కడైనా పాములు కనిపిస్తే పెద్ద సంచులు, గొట్టాలతో పట్టడం, వాటికి ఉరి వేసి బంధించడం క్రమేపీ అలవాటు చేసుకున్నాడు. అలా ఆయన ప్రస్థానం 35 ఏళ్ల కిందట ప్రారంభమైంది. అలాగే యూట్యూబ్, ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చాక పాములు పట్టడంలో మరిన్ని మెలకువలు నేర్చుకున్నారు. క్రమేపీ చాకచక్యంగా పాములు పట్టడంలో సిద్ధహస్తుడిగా మారిపోయాడు. 2018 తితిలీ తుపాను సమయంలో ఏకంగా 1,500 పాములు పట్టి రికార్డు సృష్టించాడు. సాధారణంగా ఏడాదికి 500 వరకూ పాములు పడుతుంటాడు. శ్రీకాకుళం, విజయనగరంతో పాటు ఒడిశాలోని పర్లాకిమిడి, కాశీనగర్, గుణుపూర్‌కు సైతం వెళ్లి పాములు పడుతుంటారు. అందుకే తన నంబర్‌తో పాటు ప్రత్యేక యూట్యూబ్ చానల్ సైతం ఏర్పాటు చేశాడు. సోషల్ మీడియాలో తనను సంప్రదిస్తే వీలైనంత వేగంగా అక్కడకు వెళ్తుంటారు. అయితే పాములు పట్టడం అనేది తనకు ఉపాధి కాదని.. కేవలం మనుషుల ప్రా ణాలు పోకూడదని.. అలాగే జీవహింస లేకుండా చేయాలన్నదే తన ఉద్దేశమని వేణుగోపాలరావు చెబుతున్నాడు. పాములు ప డితే డబ్బులు డిమాండ్ ఉండదని.. వారి సంతోషంగా ఇచ్చిందే తీసుకుంటామని చెబుతున్నాడు. ఎక్కడైనా పాములు పట్టాలంటే 93951 42681 నంబర్‌ను సంప్రదించాలని సూచిస్తున్నాడు.


నాగుపామును పట్టుకున్న వేణుగోపాలరావు

నైపుణ్యాలతోనే ఉపాధి అవకాశాలు

శ్రీకాకుళం రూరల్: పోటీ ప్రపంచంలో విద్యార్హతలు కంటే నైపుణ్యత ఉంటేనే రాణించగలమని జెమ్స్ సీఓఓ శ్రీధర్‌రెడ్డి అన్నారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో బొల్లినేని బీఎస్సీ ఎలైడ్ అండ్ హెల్త్‌కేర్ కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లుగా వైద్యరంగంలో ఎన్నో మార్పులు జరుగుతున్నాయని, ప్రత్యేక నైపుణ్యం కలిగిన వారు మాత్రమే ఈ రంగంలో రాణించగలరని చెప్పారు. బీఎస్సీ ఎలైడ్ హెల్త్‌కేర్ కోర్సులకు మంచి డిమాండ్ ఉందన్నారు. జెమ్స్ మెడికల్ డైరెక్టర్ హేమంత్ మాట్లాడుతూ రోగికి వైద్య చికిత్సలో ఎలైడ్ హెల్త్ కోర్సు విద్యార్థుల పాత్ర కీలకమని చెప్పారు. వైద్యుని తరువాత స్థానం వీరిదేనన్నారు. బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ పట్టుదలతో చదివితే విజయం సొంతమవుతుందన్నారు. అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మీ పద్మజ మాట్లాడుతూ కళాశాల దశమ వార్షిక ప్రణాళిక, సాధించిన ప్రగతిని వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


జ్యోతిప్రజ్వలన చేస్తున్న సీఓఓ

నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విశ్వమానవ సమానత్వం కోసం తన కలంతో గర్జించిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని బడుగు, బలహీనవర్గాల నాయకులు పేర్కొన్నారు. శ్రీకాకుళంలోని మహాత్మా జ్యోతిరావు పూలే పార్కులో ఆదివారం జాషువా 130వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆనాటి సమాజంలో ఉన్న కుల వివక్షత, అణచివేత, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా తన కలాన్ని ఆయుధంగా మలిచి గబ్బిలం, ఫిరదౌసి, కాందిశీకుడు వంటి అనేక రచనలు ద్వారా సమాజాన్ని చైతన్యపరచినా గొప్ప కవి గుర్రం జాషువా అని కొనియాడారు. బడుగు, బలహీనవర్గాలతో పాటు మహిళల సమానత్వం కోసం అనేక రచనలు చేశారన్నారు. యువత ఆయన అడుగుజాడల్లో నడుచుకోవడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం, దళిత సంఘాలు, బహుజన నాయకులు కళ్ళేపల్లి రాంగోపాల్, కంఠ వేణు, అమీరుల్లా బేగ్, గద్దిబోయిన కృష్ణ, కాగిత వెంకటరావు, యజ్జల గురుమూర్తి, కిల్లాన శ్రీనివాస్, ఆలాపన త్రినాథ్‌రెడ్డి, బోనెల రమేష్, సీర రమేష్‌బాబు, పడాల ప్రతాప్‌కుమార్, పురుషోత్తం రాంబాబు, యడ్ల జానకీరావు, సాంబారిక సూరిబాబు, గొల్లపల్లి నందేశ్ పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

ముగ్గురిపై కేసు నమోదు

హిరమండలం: మాళువ పరిధిలో ఈనెల 24న అడవి పందిని వేటాడి మాంసాన్ని వాటాలు వేసుకున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పాతపట్నం అటవీశాఖ రేంజర్ అమ్మనాయుడు ఆదివారం విలేకరులకు తెలిపారు. తుంగతంపర గ్రామానికి చెందిన జి.లక్ష్మీనారాయణ, సీహెచ్ లక్ష్మినారాయణ, అవలంగి గ్రామానికి చెందిన ఎల్.లోకేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు చెప్పారు.

కబళించిన కిడ్నీ మహమ్మారి

పొందూరు: కృష్ణాపురం గ్రామంలో కిడ్నీ మహమ్మారి మరొకరిని కబలించింది. ఏటా ఈ గ్రామంలో పదుల సంఖ్యలో మృతి చెందుతున్నారు. తాజాగా గార వెంకటమ్మ (48) అనే మహిళ ఆదివారం మృతి చెందింది. ఈమె రెండేళ్లుగా డయాలసిస్ చికిత్స పొందుతోంది. పరిస్థితి విషమించడంతో మృత్యువాతపడింది. ఈమెకు భర్త రమణ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గ్రామంలో ఇప్పటికే 20 మంది కిడ్నీ సమస్యతో మరణించగా, పదుల సంఖ్యలో చికిత్స పొందుతున్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: బన్నువాడకు చెందిన వట్టికూళ్ల కూర్మారావు(56) పాముకాటుకు గురై ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. కూర్మారావు పొలం పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. తీవ్ర అస్వస్థతకు గురికావడంతో స్థానికులు హుటాహుటిన టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కూర్మారావుకు భార్య సరస్వతి, కుమార్తె ఉన్నారు. కూర్మారావు మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

భవానీల శూలాయుధ ప్రదర్శన


శ్రీకాకుళం దమ్మలవీధికి చెందిన భవానీస్వాములు ఆదివారం శూలాయుధ ప్రదర్శన చేశారు. నోటిలో శూలాలు గుచ్చుకొని దమ్మలవీధి నుంచి కాకివీధి వదరకు ఊరేగింపుగా వచ్చారు. ముత్యాలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. – శ్రీకాకుళం కల్చరల్

అ'పూర్వ' సమ్మేళనం


శ్రీకూర్మం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–99 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి రూ.50 వేలు కేటాయించారు. అనంతరం ఆటపాటలతో సందడి చేశారు. – గార

30న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన


ముంజేటి కృష్ణమూర్తి

గార: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 30న జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడతామని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో, జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ సూచనలతో జిల్లాలోని అన్ని దళిత సంఘాలను సమన్వయం చేస్తూ, పార్టీ అనుబంధ విభాగాలతో నిరసన ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రైవేటీకరణ వెనక్కి తీసుకునే వరకు ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. పేద ప్రజల ఆరోగ్యానికి నష్టం చేకూర్చేలా కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు హేయమన్నారు. నిరసన కార్యక్రమంలో జిల్లా అన్ని విభాగాల నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బొలెరో ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని దీపామహల్ పెట్రోల్‌బంక్ ఎదురుగా బొలేరో వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ట్రాఫిక్ ఎస్ఐ మెట్ట సుధాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుమారు 35 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి.. రామలక్ష్మణ కూడలి నుంచి సూర్యమహల్ వైపు నడుచుకుని వస్తుండగా జలుమూరు మండలం ఉద్దాకులపేట గ్రామానికి చెందిన కె.వి.జోగారావు రాంగ్‌రూట్‌లో తన బొలేరో వాహనాన్ని అకస్మాత్తుగా వెనక్కి తీసి ఢీకొట్టాడు. దీంతో ఆ వ్యక్తి తల, కాళ్లకు తీవ్రగాయాలై స్పృహ కోల్పోయాడు. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది వచ్చి రిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్యచికిత్సకోసం కేజీహెచ్‌కు తరలించేందుకు సమాయత్తమవుతుండగా వ్యక్తి మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పేకాట శిబిరంపై దాడి

శ్రీకాకుళం రూరల్: సింగుపురం జాతీయ రహదారి పరిసర ప్రాంతంలో ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్న ఐదుగురిని రూరల్ పోలీసులు పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి నాలుగు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్‌లు, రూ.6810 నగదు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యయ ప్రయాసల రేషన్

- ఉచిత రేషన్ తీసుకొచ్చేందుకు రూ.200 ఖర్చు
- ఏడు గిరిజన గ్రామాల ప్రజలకు తప్పని వ్యధ
- కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం.. గిరిజనులకు శాపం

హిరమండలం : కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా మారింది ఆ ఏడు గిరిజన గ్రామాల పరిస్థితి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇంటింటా రేషన్ సరఫరా చేయడంతో అప్పట్లో ప్రతి ఇంటికి తెచ్చి ఇచ్చేవారు. ఇప్పుడు రేషన్ తెచ్చుకోవాలంటే రూ.200 ఖర్చవుతోందని హిరమండలం మండలంలోని లోకొండ పంచాయతీ పరిధిలోని ఏడు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ పంచాయతీలో లోకొండ, మామిడిజోల, మొగడపేట, గోడిపాడు, పూలకొండ, తాళ్లపాడు, లింగుపురం తదితర గ్రామాలున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వాహనం ద్వారా ఇంటింటికి రేషన్ అందించేవారు. గిరిజనులు కూడా నిశ్చింతగా తీసుకునేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇంటింటా రేషన్ సరఫరా చేసే వాహనాలను తొలగించింది. పాత రేషన్ విధానాన్ని పునరుద్ధరించింది. దీంతో వీరికి కష్టాలు మొదలయ్యాయి.


సుదూరంగా డిపో..

లోకొండ పంచాయతీ పరిధిలో ఏడు గ్రామాలు ఉన్నాయి. వీటి పరిధిలో రేషన్ డిపో కేటాయించకుండా భగీరథపురంలో డిపో ఏర్పాటుచేశారు. అక్కడికి వెళ్లాలంటే ఆరు కిలోమీటర్లు వ్యయ ప్రయాసాలకు గురికావాల్సి వస్తోంది. ఉచిత రేషన్ కోసం కుటుంబానికి 30 నుంచి 50 కిలోల బియ్యం అందిస్తున్నారు. ఆ బియ్యాన్ని తెచ్చుకునేందుకు ఆటోలో వెళ్లాల్సి వస్తోంది. ఒక్కో కుటుంబం రూ.100 నుంచి రూ.200 వరకూ ఖర్చు చేయాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి లోకొండ పంచాయతీ పరిధిలో రేషన్ డిపోను ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.


మూడు కిలోమీటర్లు నడిచివెళ్లి రేషన్ బియ్యం తీసుకువస్తున్న నందేస్(ఫైల్)


లోకొండలో నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు


డిపో ఏర్పాటుచేయాలి



స్థానికంగా రేషన్ డిపో ఏర్పాటుచేయాలి. గతంలో ప్రతి ఇంటికి సులువుగా రేషన్ అందేది. ఇప్పుడు రేషన్ కావాలంటే 6 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోంది. వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తోంది. గిరిజనుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వమే ఇంటింటికీ రేషన్ అందించాలి.

– కుద్దిగాం రాము, లోకొండ

అప్పుడే బాగుండేది..



గత ప్రభుత్వంలో ఎంతో బాగుండేది. ఇప్పుడు పేరుకే ఉచిత రేషన్. తెచ్చుకోవాలంటే కనీసం రూ.100 ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇంతకంటే అన్యాయం మరొకటి ఉంటుందా? ప్రభుత్వం ఇప్పటికైనా తప్పిదాన్ని సరిచేయాలి. లోకొండ పంచాయతీ పరిధిలో డిపో ఏర్పాటుచేయాలి.

– ఎన్.బుద్ధమ్మ, లోకొండ